
www.prajasakti.com
ప్రజాశక్తి
గురువారం 24 నవంబర్ 2022
5
శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు





## పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటాలి : కలెక్టర్

**ప్రజాశక్తి-నెల్లూరు :** ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసుకొని అమలు చేస్తున్న 'జగనన్న పచ్చతోరణం' కార్యక్రమంలో భాగంగా జిల్లాలో 12.10లక్షల మొక్కలు నాటాలని లక్ష్యంగా పెట్టుకున్నామని, ఇప్పటి వరకు 7 లక్షల మొక్కలు నాటి ప్రభుత్వ లక్ష్యానికి చేరువుగా ఉన్నామని కలెక్టర్ చక్రధర్‌బాబు పేర్కొన్నారు.బుధవారం కార్తీక వన మహోత్సవ కార్యక్రమంలో భాగంగా మధ్యాహ్నం భోజన విరామ సమయంలో నగర శివారులోని పొదలకూరు మార్గంలోని నగరవనంలో అటవి శాఖ ఆధ్వర్యంలో ఆయన మొక్కలు నాటారు. కలెక్టర్ తో పాటు సంయుక్త కలెక్టర్ రొనంకి కూర్మానాథ్, మునిసిపల్ కమిషనర్ డి హరిత, కందుకూరు సబ్ కలెక్టర్ శోభిక, సహాయ కలెక్టర్ విద్యాధరి,డిఆర్ఓ వెంకటనారాయణమ్మ, డిఎఫ్ఒలు చంద్రశేఖర్, శ్రీనివాసులు పాల్గొన్నారు.



మొక్కనాటుతున్న కలెక్టర్ చక్రధర్‌బాబు

# వర్షం ముసురు..రైతుల్లో ఆందోళన..!

**బంగాళఖాతంలోఅల్పపీడనం ప్రభావంగా కొద్ది రోజుల నుంచి జిల్లా వ్యాపితంగా ఓ మోస్తరు నుంచి భారీ వర్షాలు కురుస్తున్నాయి. చెరువులు నిండుకుండలా మారాయి. ప్రస్తుతం నారుమళ్లు పోశారు. మరికొన్ని చోట్ల నారు వేతలు వేశారు. వర్షం కొనసాగు తుండడంతో రైతుల్లో ఆందోళన నెలకొంది. వర్షాలు ఇలాగే కొనసాగితే నారుమళ్లు కుళ్లిపోయే ప్రమాదం ఉంది. వర్షాలు మరి కొద్దిరోజులుంటాయని వాతావరణ కేంద్రం హెచ్చరించింది. చెరువుల నిండి ఉండడం, చెరువుల కట్టలు బలహీనంగా ఉండడంతో రైతులు ఆదోళన చెందుతున్నారు. గతేడాది చెరువులు తెగి రైతులు భారీగా నష్టపోయారు. కోట్లలో నష్టపోయారు.**

## నారుమళ్లకు తీవ్ర నష్టం - వారం నుంచి వర్షాలు

**ప్రజాశక్తి-నెల్లూరు ప్రతినిధి**

బంగాళఖాతంలో అల్పపీడనం కారణంగా జిల్లాలో కొద్ది రోజులుగా వర్షాలు కురుస్తున్నాయి. చెరువులకు జలకళ వస్తుంది. జిల్లా వ్యాపితంగా 1800 చెరువులున్నాయి. దాదాపు కొన్ని చెరువుల్లోనూ నీరు చేరింది. సాధారణంగా ప్రతేడాది అక్టోబర్, నవంబర్లో రుతుపవనాలు కారణంగా భారీ వర్షాలు వస్తాయి. ఒక్కో ఏడాది ఒక్కో ప్రాంతంలో భారీ వర్షాలు రావడం సర్వసాధారణం. భారీ వర్షాలు, వరదలు కారణంగా జిల్లాలోని ఏడో డివిజన్ భారీగా దెబ్బతింటుంది. 2008లో కావలి డివిజన్, 2016లో గూడూరు, 2014లో నెల్లూరు, 2019లో నెల్లూరు, ఇలా ప్రతిసారి భారీ వర్షాల ప్రజలను తీవ్రంగా నష్టపరుస్తున్నాయి. ప్రస్తుతం జిల్లా వ్యాపితంగా వరి సాగుకు రైతులు సిద్ధమవుతున్నారు. సంగం మండలంలో కొంత నారుమళ్లు కొనసాగుతుండగా, కొంత నారు వేతలు పూర్తి చేశారు. ఆత్మకూరు, కోవూరు, బుచ్చి, కొడవలూరు, అల్లూరు, టిపి గూడూరు, మనుబోలు, నెల్లూరు రూరల్, వెంకటాచలం దాదాపు అన్ని మండలాల్లో ఇదే పరిస్థితి కొనసాగుతోంది.గతేడాది పండించిన పంటకు గిట్టుబాటు ధర దక్కలేదు. ప్రభుతం తీసుకున్న ధాన్యాన్ని నగదు పూర్తిగా చెల్లించలేదు. పుట్టి రూ.16,650 ఉంటే, ప్రయివేటు వ్యక్తులు, మిల్లర్లు కేవలం పుట్టి రూ.13 వేలకే కొనుగోలు చేశారు. ఎకరానికి రూ.25 వేలు ఖర్చుచేసినా, కనీసం ఖర్చులు అందలేదు. ఇటీవల రైతులు తమకు ప్రభుత్వం నుంచి రావాల్సిన నగదు ఇవ్వాలని ఆందోళనకు దిగారు. ప్రభుత్వం నుంచి సాయం అందకపోయినా రైతులు అప్పులు చేసి, వడ్డీలకు తెచ్చుకొని మళ్లీ వ్యవసాయం మొదలు పెట్టారు. నారు మళ్ళు, నారు వేతలు దశలోని వరి వర్షాలకు దెబ్బతింటే పరిస్థితి మరీదారుణంగా మారుతుంది. గతేడాది మూడుసార్లు నారుమళ్లు దెబ్బతిన్నాయి. ప్రభుత్వం ఇస్తామని ఇన్‌పుట్ సబ్సిడీ ఇవ్వలేదు. ప్రస్తుతం వస్తున్న వర్షాలు, వరదలు ఎక్కువైతే రైతులు మళ్లీ నష్టపోయే ప్రమాదం ఉంది.



**చెరువులకు జలకళ..!**

కొద్దిరోజులుగా కురుసోన్న వర్షాలకు చెరువులు జలకళ సంతరించుకుంటున్నాయి. దాదాపు అన్ని చెరువులకు 80 నుంచి 90 శాతం నీరువచ్చింది. వర్షాలు ఎక్కువైతే చెరువుల పరిస్థితి ఏమిటో అర్థం కావడం లేదు. కోవూరు, సంగం, కనుపూరు, బుజబుజనెల్లూరు, అల్లూరు, కావలి, కొడవలూరు ఒక్కటేమి ఎక్కువ చెరువుల్లో నీరు చేరింది. జిల్లాలోని దాదాపు చెరువులన్నీ లింకు చెరువులు. ఒక్క చెరువు నిండితే మరో చెరువు నిండుతోంది. ఒక్క చెరువు తెగితే అన్ని చెరువులు తెగిపోతాయి. గతేడాది వర్షాలు, వరదలు కారణంగా తెగిన చెరువులకు అధికారులు తాత్కాలిక మరమ్మతులు మాత్రమే చేశారు. శాశ్వత మరమ్మతులు ఎక్కడ పూర్తి చేయలేదు. వర్షాలు ఇలానే కొనసాగితే చెరువులు తెగే ప్రమాదం ఉంది. ప్రభుత్వం చెరువులకు శాశ్వత మరమ్మతులు నిర్వహిస్తే ప్రమాదం తప్పుతోంది. ప్రభుత్వం ఆ దిశగా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

# రాష్ట్రంలో విభజన చట్టం అమలు చేయాలి

## 25న టౌన్‌హాల్ రీడింగ్ రూమ్‌లో సదస్సు




మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి మూలం రమేష్

**ప్రజాశక్తి-నెల్లూరు**

గత ఎన్నికల సమయంలో ఆంధ్రరాష్ట్రంలో విభజన చట్టాన్ని అమలు చేస్తామని బిజెపి ప్రజలకు చేసిన హామీని అమలు చేయాలంటూ ఈ నెల 25వ తేదీన నెల్లూరు నగరంలోని టౌన్‌హాల్ రీడింగ్ రూంలో వామపక్షపార్టీల ఆధ్వర్యంలో సదస్సు నిర్వహిస్తున్నట్లు సిపిఎం జిల్లా కార్యదర్శి మూలం రమేష్ పేర్కొన్నారు.బుధవారం నెల్లూరు నగరంలోని డాక్టర్ రామచంద్రారెడ్డి భవన్‌లో సిపిఎం, సిపిఐ, న్యూ డెమోక్రసీ నాయకులతో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మీడియాతో మాట్లాడుతూ రాష్ట్ర విభజన కారణంగా ఆంధ్రప్రదేశ్ చాలా నష్టపోయిందన్నారు. విభజన అనంతరం రాష్ట్రానికి ప్రత్యేక హోదా, రాయితీలు, అవకాశాలు కల్పిస్తామని ఎన్నికల సమయంలో బిజెపి హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిన అనంతరం వాటిని విస్మరించిందన్నారు. మాజీ ఉపరాష్ట్ర ప్రతి వెంకయ్యనాయుడు సైతం పార్లమెంట్‌లో ప్రకటించారని, ఆ సమయంలో కేంద్రంతో పోరాడి రాష్ట్రానికి ప్రత్యేక హోదా, ప్యాకేజీ తీసుకొస్తామని టిడిపి అంటే కాదు.. కాదు పార్లమెంట్‌లో వైసిపికి మెజారిటీ, రాష్ట్రంలో అధికారం అప్పగిస్తే తప్పకుండా రాష్ట్రానికి ప్రత్యేక హోదా తాము తీసుకొస్తామని పోటా పోటీగా ప్రజలకు వాగ్దానాలు చేశారన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో అధికారంలోని వైసిపి ప్రభుత్వం, ప్రతిపక్ష హోదాలో ఉన్న టిడిపి రెండూ కేంద్రం విభజన హామీలు అమలు చేయాలన్నారు. ప్రత్యేక హోదా రాష్ట్రానికి కావాలని, విశ్వవిద్యాలయాలు, రైల్వే జోన్, పోర్టు, విశాఖ ఉక్కు పరిశ్రమ యువతకు ఉపాధి కల్పించేందుకు అవసరమైన పరిస్థితి కల్పించాలని బిజెపి ప్రభుత్వాన్ని ప్రశ్నించిన దాఖలాలు లేవన్నారు. ఈ సమస్యల పరిష్కారానికి వామపక్ష పార్టీలు అనేక రకాలుగా పోరాటాలు నిర్వహించిందన్నారు. విభజన చట్టాన్ని కేంద్రం అమలు చేయాలని సిపిఎం, సిపిఐ, న్యూ డెమోక్రసీ తదితర వామపక్ష పార్టీలన్నీ కలిసి 25వ తేదీన టౌన్‌హాల్ రీడింగ్ రూంలో సదస్సు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సదస్సుకు జిల్లా ప్రజానీకం భారీగా హాజరై కేంద్రం విభజన హామీలు అమలు చేయాలన్న వాదనను కేంద్ర ప్రభుత్వానికి గట్టిగా వినిపించాలని పిలుపు నిచ్చారు. అంతే కాకుండా 26వ తేదీన ప్రత్యేక హోదా సాధన కమిటీ ఢిల్లీలో ధర్నా కార్యక్రమం నిర్వహించి అనంతరం ప్రధాని మోడీని కలిసి విభజన చట్టాన్ని అమలు చేయాలని కోరుతూ వినతిపత్రం అందజేయనున్నట్లు తెలిపారు.

రాష్ట్ర విభజన సమయంలో బిజెపి, కాంగ్రెస్ రెండూ పోటీ పడి ఆంధ్రరాష్ట్ర ప్రజలకు న్యాయం చేస్తామని అనేక వాగ్దానాలు చేశారని సిపిఐ జిల్లా సమితి కార్యదర్శి దామా అంకయ్య అన్నారు. అంతే కాకుండా తిరుపతిలో జరిగిన సభలో ప్రధాని మోడీ, ప్రస్తుత మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు అనేక వరాలు ప్రకటిస్తూ రాష్ట్రానికి మంచి భవిష్యత్తు ఉందని మాటలు చెప్పారన్నారు. విభజన సందర్భంగా మంత్రి వర్గం అమోదించిన వాటిల్లో ఏ ఒక్క అంశాన్ని బిజెపి ప్రభుత్వం అనుమతించలేదన్నారు. టిడిపి, కాంగ్రెస్ పార్టీల వ్యక్తిగత కారణాల వల్ల కేంద్రాన్ని ప్రశ్నించలేని పరిస్థితిలో ఉన్నారని ఎద్దేవా చేశారు. విభజన సందర్భంగా విశాఖ రైల్వే జోన్, పోర్టులు, రాయలసీమ వెనకబడిన ప్రాంతాలు, ఉత్తరాంధ్ర వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికి ప్యాకేజీ ప్రకటించాలని సదస్సు ద్వారా కేంద్రాన్ని అడగనున్నట్లు తెలిపారు. ఈ పోరాటానికి ప్రజలు సంఘీభావం తెలియజేస్తూ సదస్సులకు, సభలకు భారీ సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపు నిచ్చారు. కార్యక్రమంలో న్యూ డెమోక్రసీ నాయకులు మాట్లాడుతూ రాష్ట్రానికి ప్రత్యేక హోదా కల్పిస్తే అనేక పరిశ్రమల స్థాపనకు అవకాశం లభిస్తుందన్నారు. ఈ సదస్సులో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు మాదాల వెంకటేశ్వర్లు, ఎం. మోహన్‌రావు, సిపిఎం సీనియర్ నాయకులు చంద్ర రాజగోపాల్, సిపిఎం నగర కార్యదర్శి కత్తి శ్రీనివాసులు, పలువురు సిపిఐ నాయకులు పాల్గొన్నారు.

# మెరుగైన పారిశుధ్యం నిర్వహణకు చర్యలు

## మేయర్ పి. స్రవంతి

**ప్రజాశక్తి-నెల్లూరు :** జాతీయ హరిత ట్రిబ్యునల్ మార్గదర్శకాలకు అనుగుణంగా భవన నిర్మాణ మిగులు సామాగ్రి, శిథిలాలను తరలించేందుకు నూతన వాహనాలను కేటాయించి, నగర వ్యాప్తంగా మరింత మెరుగైన పారిశుధ్య సేవలను అందించనున్నామని నగర పాలక సంస్థ మేయర్ పి.స్రవంతి తెలిపారు. పర్యావరణ పరిరక్షణ హితానికై నేషనల్ క్లీన్ ఎయిర్ ప్రోగ్రాంలో భాగంగా నగర పాలక సంస్థకు మంజూరైన ప్రోత్సాహకం మొత్తం రూ.76 లక్షలతో కొనుగోలు చేసిన 8 ట్రాక్టర్లను కార్యాలయం ప్రాంగణంలో బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ భవనాల నిర్మాణంలో మిగులు నిర్మాణ సామగ్రి, పాత నిర్మాణాల కూల్చివేత అనంతరం మిగిలే శిధిలాలను నూతన వాహనాల సాయంతో త్వరితగతిన తొలగించగలమని తెలిపారు. నగర పాలక సంస్థ సూచించిన పారిశుధ్య నిర్వహణ ప్రమాణాలను ప్రజలంతా ఆచరించి నగరాభివద్ధిలో భాగస్వాములు కావాలని మేయర్ ఆకాంక్షించారు. అనంతరం కమిషనర్ హరిత మాట్లాడుతూ నూతన ట్రాక్టర్ల వినియోగంతో కన్స్ట్రక్షన్, డెమొలిష్ వేస్ట్ మెటీరియల్ తరలింపుతో పాటుగా డ్రైను కాలువల సిల్టు పూడికతీతను కూడా సులభంగా తరలించవచ్చని తెలిపారు. ప్రజలంతా తడి, పొడి చెత్తలను విడివిడిగా అందించి రీసైక్లింగ్ ప్రక్రియకు సహకరించాలని కమిషనర్ విన్నవించారు. డిప్యూటీ మేయర్ రూప్ కుమార్ యాదవ్, వైసిపి రాష్ట్ర కార్యదర్శి కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి, కో ఆప్షన్ సభ్యులు మొబీనా, కార్పొరేటర్లు మొయిళ్ళ గౌరి, బొబ్బల శ్రీనివాస్ యాదవ్, విజయ్ భాస్కర్ రెడ్డి, ఒరిస్సా శ్రీనివాసులు రెడ్డి, చేజర్ల మహేష్, సత్తార్ బాషా, నగర పాలక సంస్థ ఇంజనీరింగ్ విభాగం అధికారులు సంపత్ కుమార్, సంజయ్, చంద్రయ్య పాల్గొన్నారు.




ట్రాక్టర్లను ప్రారంభిస్తున్న మేయర్ పి స్రవంతి


# తాగునీటి పథకాలకు రూ. 80 కోట్లు : కాకాణి



పొదలకూరు మండలంలో..

**ప్రజాశక్తి -పొదలకూరు** :సర్వేపల్లి నియోజకవర్గంలో తాగునీటి పథకాలకు సంబంధించి రూ. 80 కోట్లు మంజూరయ్యాయని రాష్ట్ర వ్యవసాయ శాఖా మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి పేర్కొన్నారు. పొదలకూరు పంచాయతీలో ఎనిమిదో రోజు బుధవారం ఆయన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నాగార్జున స్కూల్ వీధి, రామ మందిరం, బజారు వీధుల్లో కొనసాగించారు. ఆయన మాట్లాడుతూ నియోజ కవర్గంలో 193 తాగునీటి పనులకు సంబంధించి అధికారులు అంచనా రూపొం దించారని తెలిపారు. దీనికి సంబంధించి ఉత్తర్వులు కూడా మంజూరు అయ్యాయని తెలిపారు. జెడ్‌పిటిసి తెనాలి నిర్మలమ్మ, సర్పంచ్ మల్లిక చిట్టెమ్మ, గోగిరెడ్డి గోపాల్ రెడ్డి, పెద్దమల్లు రమణారెడ్డి, మద్దిరెడ్డి రమణారెడ్డి, వాకాటి శ్రీనివాసులురెడ్డి, మూలి సతీష్ కుమార్ రెడ్డి, ఆర్.జయమూర్తి రెడ్డి, పాల్గొన్నారు.

**ప్రజాశక్తి -ఉలవపాడు** :మండలంలోని భీమవరం పంచాయతీలో దళితవాడ, ఓసి కాలనీలో బుధవారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం జరిగింది. ఎంఎల్ఎ మానుగుంట మహీధర్‌రెడ్డి పాల్గొన్నారు. ఎంఎల్ఎ ప్రతి ఇంటికి వెళ్లి ఆప్యాయంగా పలకరిస్తూ సంక్షేమ పథకాలు అందుతున్న తీరును తెలుసుకున్నారు. సర్పంచ్ మేడిద. రాజమ్మ, మేడిద నాగేశ్వరరావు, చీమకుర్తి కష్ణారెడ్డి, విద్యుత్‌శాఖ ఏఈ నరసింహం పాల్గొన్నారు.



ఉలవపాడులో..

## వెంకటాచలంలో చోరీ

**వెంకటాచలం :**సర్వేపల్లి క్రాస్ రోడ్డు సమీపంలో ఉన్న ఓ ఇంట్లో మంగళవారం రాత్రి చోరీ జరిగింది. వివరాల మేరకు వెంకటాచలం గ్రామానికి చెందిన పఠాన్ కరీమున్నీసా పక్కనే ఉన్న తన కూతురు ఇంట్లో పడుకుంది. ఉదయం లేచి వచ్చేసరికి ఇంటికి తాళం పగలగొట్టి ఉంది. గమనించి లోపల చూడగా రెండు బీరువాల్లో ఉన్న 62,000 నగదు అపహరించినట్లు గుర్తించింది. దీంతో పోలీసులకు సమాచారం అందించగా ఎస్ఐ అయ్యప్ప సంఘటనా స్థలం చేరుకుని పరిశీలించారు. అనంతరం క్లూస్ టీమ్‌ను పిలిపించి వేలిముద్రలు సేకరించి బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తు న్నారు. ఇటీవల వరుస దొంగతనాలతో గ్రామస్తులు భయపడుతున్నారు.

## విద్యా, వైజ్ఞానిక ప్రదర్శనలు

**ప్రజాశక్తి -కందుకూరు :** మండలంలోని మాచవరం జిల్లా ఉన్నత పాఠశాలలో బుధవారం పాఠశాల స్థాయి విద్యా వైజ్ఞానిక ప్రదర్శనలు ప్రధానోపా ధ్యాయులు గొర్రెపాటి మాల్యాద్రి అధ్యక్షతన ఉపాధ్యాయుల సహకా రంతో నిర్వహించారు. ఈ కార్యక్ర మానికి ముఖ్య అతిథులుగా మండల విద్యాశాఖ అధికారి వెంకటేశ్వర నాయక్, మాచవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ కెపి స్వాతి, మాచవరం పశు వైద్యశాల డాక్టర్ ఈ చెన్నకేశవులు, స్టేట్ బ్యాంకు మేనేజర్ చార్వాక, పాల్గొని సైన్స్ ఫెయిర్ ఆవశ్యకత గురించి తమ చక్కని సందేశాలు అందించారు. విద్యార్థుల ప్రదర్శించిన ఎగ్జిబిషన్ తిలకించి విద్యార్థులను అభినందించారు పాఠశాల స్థాయిలో ఐదు పెర్సన్ నుంచి ఒక్కొక్క ప్రాజె క్టును ఎంపిక చేసి మండల విద్యా కేంద్రానికి సమర్పించినట్లు ప్రధానోపాధ్యాయులు తెలిపారు.



మాట్లాడుతున్న ఎంఇఒ వెంకటేశ్వర నాయక్

## బూత్‌లెవల్ కమిటీలు ఏర్పాటు

**ప్రజాశక్తి -కందుకూరు** : కందుకూరు 18వ వార్డులో బూత్ కమిటీల నియామకం జరిగింది. పట్టణ టిడిపి అధ్యక్షుడు దామా మల్లేశ్వరరావు, పట్టణ పార్టీ ప్రధాన కార్యదర్శి ముచ్చు శ్రీనివాసులు, పట్టణ పార్టీ ఉపా ధ్యక్షులు సయ్యద్ జియావుద్దీన్, నెల్లూరు జిల్లా బీసీ సాధికార సమితి కన్వీనర్ పసుపులేటి శ్రీనివా సరావు, పట్టణ 32 వ వార్డు అధ్యక్షుడు ముప్పవరపు వేణు, 18 వ వార్డు నాయకులు రాజాసింగ్, సయ్యద్ బాబు, నియోజకవర్గ ముస్లింమైనారిటీ ఉపాధ్యక్షులు ఫిరోజ్ పాల్గొన్నారు.

## మహిళకు ఆర్థిక సాయం

**ప్రజాశక్తి -కందుకూరు :** కందుకూరు పట్టణంలోని 6వ వార్డుకు చెందిన షేక్ షహనాద్ భర్త ఇటీవల మృతి చెందారు. ఆర్థికంగా తీవ్ర ఇబ్బందుల్లో ఉన్న ఆ కుటుంబానికి సాయం చేసేందుకు కందుకూరు నియోజకవర్గ టిడిపి క్రిస్టియన్ సెల్ అధ్యక్షుడు రెబ్బవరపు మాల్యాద్రి ముందు కొచ్చారు. బుధ వారం ఆమె ఇంటికి వెళ్లి రూ. 5 వేలు ఆర్థిక సహాయం అందించారు. పట్టణ పార్టీ అధ్యక్షుడు దామా మల్లేశ్వరరావు, నియోజకవర్గ ఎస్‌సిసెల్ అధ్యక్షుడు రాయపాటి శ్రీనివాసరావు, వలేటివారిపాలెం మండల తెలుగు యువత అధ్యక్షుడు బద్దిపూడి శిఖామణి, పార్టీ నాయకులు షేక్ ఫిరోజ్, ముప్పవరపు వేణు, జడ రవీంద్ర మాల్యాద్రిని అభినందించారు.



సాయం అందజేస్తున్న నాయకులు

## 'స్పందన'లో అర్జీలు స్వీకరణ

**ప్రజాశక్తి -ఉలవపాడు :**ఉలవపాడు స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో బుధవారం జరిగిన స్పందన కార్యక్ర మానికి ఎంఎల్ఎ మానుగుంట. మహీధర్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన ప్రజల నుంచి పలు అర్జీలను స్వీకరించి అక్కడికక్కడే పరిష్కరించారు. పెండింగ్ అర్జీలను వెంటనే పరిష్కరించాలని తహశీల్దార్ సీతారామయ్యకు తెలిపారు.

# చోరీ కేసుల్లో నిందితులు అరెస్టు



వివరాలు వెల్లడిస్తున్న డిఎస్‌పి కండే శ్రీనివాసులు

## రూ. 5 లక్షల సొత్తు స్వాధీనం

**ప్రజాశక్తి -కందుకూరు**

కందుకూరు, కావలి పరిసర ప్రాంతాలలో దోపిడీలకు పాల్పడిన ముగ్గురు వ్యక్తులను అరెస్టు చేసి వారి వద్ద నుండి రూ. 5 లక్షల విలువ చేసే సొత్తునుస్వాధీనం చేసుకున్నట్లు కందుకూరు డిఎస్‌పి కండే శ్రీనివాసులు తెలిపారు. స్థానిక డిఎస్‌పి కార్యాలయంలో బుధవారం జరిగిన విలేకర్ల సమావేశంలో కండే శ్రీనివాసులు వివరాలు వెల్లడించార. రాత్రి వేళల్లో తాళాలు పగలగొట్టి ఇల్లు, కిరాణా షాపుల్లో డబ్బులు, నగలను దొంగలించిన కేసులో నిందితులను కందుకూర్ రూరల్ పోలీసులు మండలం, కొండి కందు కూరుకు చెందిన కుంచాల అశోక్, కందుకూరు పట్టణం గోకరాజుపాలెంకు చెందిన దండే సాయికుమార్, విక్కిరాలపేట రోడ్డులో నివాసం ఉంటున్న ఇరపని రామ్ నరేష్ ముగ్గురు కందుకూరు మండలం మాచవరంలో నాలుగు, ఉలవపాడు మండలం కరేడులో ఒకటి, కావలి గ్రామంలో ఒక చోరీకి పాల్పడ్డారు. రూ. 2.లక్షలా, 41 వేల నగదు తో పాటు ఐదు సవర్ల బంగారు ఆభరణాలను మొత్తం ఐదు లక్షలు విలువ చేసే సొత్తును రికవరీ చేసినట్లు డిఎస్‌పి తెలిపారు. కుంచాల అశోక్ పలు దోపిడీ కేసుల్లో నిందితుడుగా ఉన్నాడు. ఇతనిపై సస్పెక్టెడ్ షీట్ ఉన్నట్లు తెలిపారు.ఈ కేసులను ఛేదించిన సిఐ వెంకట్రావు, రూరల్ ఎస్ఐ నాంచారయ్యలను ఎస్‌పి విజయరావు అభి. నందించారు. కందుకూరు సిఐ వెంకట్రావు, కందుకూరు రూరల్ ఎస్ఐ శివనాంచారయ్య ఉన్నారు.

అరెస్టు చేశారు. అక్రమ మార్గంలో డబ్బు సంపాదించేందుకు రాత్రి వేళల్లో ఆ ముగ్గురు వ్యక్తులు తాళాలు వేసిన ఇళ్లను ఎంచుకొని ఎవరూ లేని సమయంలో పగలగొట్టి బీరువాలో ఉన్న నగలు, డబ్బులను అపహరించేవారు. కందు కూరు



స్వాధీనం చేసుకున్న నగదు, బగారు ఆభరణలు

# క్రికెట్ బెట్టింగ్ నిర్వాహకులు అరెస్టు

## రూ. 4.50 లక్షల నగదు స్వాధీనం

**ప్రజాశక్తి -కందుకూరు**

ఆన్‌లైన్ క్రికెట్ ఆడుతూ అక్రమ మద్యం అమ్ముతున్న ముగ్గురు వ్యక్తులను కందుకూరు రూరల్ పోలీసులు అరెస్టు చేసినట్లు డిఎస్‌పి కండే శ్రీనివాసులు చెప్పారు. బుధవారం స్థానిక డిఎస్‌పి కార్యాలయంలో ఆయన విలేకర్ల సమావేశం నిర్వహించారు. డిఎస్‌పి మాట్లాడుతూ డబ్బు సంపాదించడానికి వలేటివారిపాలెం మండలం కూలిపాలెం గ్రామానికి చెందిన ఘట్టమనేని శ్రీను, కందుకూరు పట్టణం తూర్పు కమ్మ పాలెం కు చెందిన పిడికిటి విజయ్, బండ పాలెం కు చెందిన యనమల నాగరాజు బెట్టింగులాడుతూ విద్యార్థులను మోసం చేస్తున్నారన్నారు. వీరి ముగ్గురిని అరెస్టు చేసి వారి వద్ద నుంచి రూ.4 లక్షలా, 42 వేల నగదు తో పాటు, నాలుగు సెల్ ఫోన్లు ,మద్యం బాటిళ్లను స్వాధీనం చేసు కున్నట్లు చెప్పారు. పట్టుబడిన వీరందరిపై షీట్లు ఓపెన్ చేస్తా మన్నారు. నింది తులను కోర్టులో హాజరుపరచనున్నట్లు తెలిపారు. నిందితులను అరెస్టు చేసి కందుకూరు సిఐ వెంకట్రావు , కందుకూరు రూరల్ ఎస్ఐ శివ నాంచారయ్యలను ఎస్‌పి విజయ రావు అడిషనల్ ఎస్‌పి చౌడేశ్వరి అభినందించారని డిఎస్‌పి తెలిపారు. సిఐ వెంకట్రావు ,రూరల్ ఎస్సై శివ నాంచారయ్య పాల్గొన్నారు.

## మహిళల అభివృద్ధికి కృషి : మానుగుంట

**ప్రజాశక్తి -ఉలవపాడు**

మండల మహిళా సమైక్య కార్య నిర్వహణ కమిటీ సమావేశం వైఎస్ఆర్ క్రాంతి పథం -డిఆర్‌డిఎ బుధవారం ఉలవపాడు మండలంలోని వెలుగు ఆఫీస్‌లో ఎంఎల్ఎ మానుగుంట మహీధర్ రెడ్డి సమక్షంలో జరిగింది. ఎంఎల్ఎ అనేక అంశాలపై విస్తతంగా చర్చించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు మూడేళ్ల పూర్తయిన విఒఎలను మార్చటానికి మీరు సమిష్టిగా నిర్ణయం తీసుకోవాలని కోరారు. ప్రభుత్వం అమలు చేయుచున్న సంక్షేమ పథకాలు ద్వారా స్వయం ఉపాధి కల్పించుకోవాలని, ఆర్థికంగా బలపడాలని మహిళలను కోరారు. మండల ఎపిఎం, సిసిలు, సమాఖ్య అధ్యక్షులు, గ్రూపు లీడర్లు, గ్రూపు సభ్యులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంఎల్ఎ మహీధర్‌రెడ్డి

## వేర్వేరు చోట్ల పిడుగుపాటు..

### ఒకరు మృతి -మరొకరికి తీవ్రగాయాలు

**ప్రజాశక్తి-నెల్లూరు**

**వేర్వేరుచోట్ల పిడుగుపడడంతో ఒకరు మృతిచెందారు. మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. ఈసంఘటన నెల్లూరు జిల్లాలోని రూరల్ మండలం, సౌత్‌మోపూరు, పొట్టేపాళెంలలో బుధవారం చోటుచేసుకుంది.**

పిడుగుపాటుకు వ్యక్తి మృతిచెందాడు. ఈసంఘటన నెల్లూరు రూరల్ మండలం, సౌత్‌మోపూరులో బుధవారం చోటుచేసుకుంది. వివరాల మేరకు.. గ్రామంలోని బిసి కాలనీకి చెందిన మక్కిన గోవర్ధన్ (40)రోడ్డు దగ్గర గేదెలు మేపుతుండగా పిడుగుపడి అక్కడికక్కడే మృతిచెందాడు. ఈసంఘటనతో కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరయ్యారు.

**మహిళకు తీవ్ర గాయాలు**

మహిళపై పిడుగుపడడంతో తీవ్ర గాయాలయ్యాయి. ఈసంఘటన నెల్లూరు జిల్లా రూరల్ మండలంలోని పొట్టేపాలెంలో బుధవారం చోటుచేసుకుంది. స్థానికుల సమాచారం మేరకు.. పొట్టేపాళెం గ్రామానికి చెందిన కందల ధనమ్మ పెన్నానది ఒడ్డును పశువులు మేపుతుంది. ఒక్కసారిగా పెద్దశబ్దంతో ఆమెపై పిడుగుపడింది. దాంతో ఆమెకు తీవ్ర గాయాలయ్యాయి. గాయపడిన ఆమెను నెల్లూరు బొల్లినేని ఆస్పత్రికి తరలించారు. మెడ, చెవులు కాలాయి. ఆమెకు మెరుగైన వైద్యం అందిస్తున్నామని, పరిస్థితి విషమంగా ఉన్నట్లు డాక్టర్లు పేర్కొన్నారు.



వాహనాలు తనిఖీ చేస్తున్న పోలీసులు

## వాహనాలు తనిఖీ

**ప్రజాశక్తి-నెల్లూరు :** జిల్లా వ్యాప్తంగా అసాంఘీక కార్యకలాపాలను అడ్డుకొనే క్రమంలో బుధవారం పోలీసు అధికారులు తమ సిబ్బంది సహాయంతో ముమ్మరంగా వాహన తనిఖీలు చేపట్టారు. ఎస్‌పి సిహెచ్ విజయరావు ఆదేశాల మేరకు జిల్లా వ్యాప్తంగా (నాకా బంద్ కార్యక్రమం) వాహన తనిఖీలు చేపట్టారు. జిల్లా వ్యాప్తంగా అన్ని ప్రధాన కూడళ్లలో , జాతీయ రహదారిపై వాహన తనిఖీలు చేశారు. ఈ వాహన తనిఖీలు చేస్తున్న సమయంలో ఇటీవల కాలంలో దొంగతనాలకు పాల్పడి, దోపిడి యత్నం చేసి, హత్యాయత్నాలకు పాల్పడి తప్పించుకొని తిరుగుతున్న ఐదు మంది నిందితులను పోలీసులు అరెస్టు చేసి కోర్టుకు హాజరు పరిచారు.

## ఓటర్ల వెరిఫికేషన్

**ప్రజాశక్తి -కందుకూరు** :టిడిపి కందుకూరు నియోజకవర్గ ఇంచార్జ్ ఇంటూరి నాగేశ్వరరావు ఆదేశాల మేరకు ఆ పార్టీ నాయకులు బుధవారం 4వ వార్డులో ఓటర్ల వెరిఫికేషన్ కార్యక్రమం చేపట్టారు. పట్టణ అధ్యక్షులు దామా మల్లేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి ముచ్చు శ్రీను, రాష్ట్ర ఎస్‌సి సెల్ కార్యనిర్వాహక కార్యదర్శి చదలవాడ కొండయ్య, పార్టీ నాయకులు నందనవనం రామసుబ్బారావు, వలేటి వెంకటేశ్వర్లు, ముప్పవరపు రమేష్, పువ్వాడి వెంకటేశ్వర్లు, పువ్వాడి లక్ష్మీకాంత్, మచ్చా మనోహర్, ముప్పవరపు వేణు, నారాయణ, షేక్ ఫిరోజ్ పాల్గొన్నారు.

## రాజారెడ్డి నియామకం



**ప్రజాశక్తి- ఉదయగిరి** : ఉదయగిరి మండల రెడ్డి కమ్యూనిటీ డెవలప్‌మెంట్ సొసైటీ అధ్యక్షునిగా కల్లూరి రాజారెడ్డిని నియమిస్తూ రాష్ట్ర అధ్యక్షులు యర్రబొడ్డి సురేంద్ర రెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ బి.వెంకటేశ్వర రెడ్డి సంయుక్తంగా నియామక పత్రాన్ని బుధవారం కడప జిల్లా వేంపల్లి రెడ్డి కమ్యూనిటీ డెవలప్‌మెంట్ సొసైటీ కార్యాలయంలో అందజేశారు. ఈ సందర్భంగా రాజారెడ్డి మాట్లాడుతూ రెడ్డి కుటుంబ సభ్యులందరినీ కలుపుకొని పోయి వారికి ఏ కష్టం వచ్చినా తాను వెన్నంటే ఉంటానని తెలిపారు. పేద, అనాథ పిల్లల చదువులకు సహకారం అందిస్తానని, ఇతర రెడ్డి సంఘాలతో సమన్వయం క్రమశిక్షణతో ముందుకు వెళ్లి రెడ్డి జాతి సమస్యలపై అవగాహన పెంచుకొని రెడ్డి జాతి ఐక్యత కోసం అభివృద్ధి కోసం అన్ని విధాలా చేయూతనందిస్తూ వారి సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తానని తెలిపారు. రెడ్డి కమ్యూనిటీ డెవలప్‌మెంట్ సొసైటీ బలోపేతం కోసం కృషి చేస్తానని రాజారెడ్డి తెలిపారు. ఆయన పదవిపై పలువురు రెడ్డి కుటుంబ సభ్యులు హర్షం వ్యక్తం చేశారు.

## పందుల బెడద

**ప్రజాశక్తి-అల్లూరు** : అల్లూరు నగర పంచాయతీ పరిధిలో పందులు బీభత్సం సృష్టించడంతో ప్రజలు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. యథేచ్చగా విచ్చలవిడిగా వాటిని రోడ్లపైకి వదిలివేయడంతో ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నాయని దుయ్యబడుతున్నారు. అలాగే పంట పొలాల్లోకి వెళ్లి పొలం గట్లను ధ్వంసం చేస్తున్నందుతో రైతులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న వాటి సంరక్షకులపై అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. ఇవి రోడ్లపైకి బారులుగా చేరుకోవడంతో నడవి వెళ్లాలంటే హడలుతున్నారు. పలు వ్యర్థాలను తినే క్రమంలో పోట్లాడుకుంటూ జనాలపైకి వస్తుండడంతో వాటిని చూసి జడుసుకుంటున్నారు. నగర పంచాయతీ అధికారులు సత్వరమే చర్యలు చేపట్టాలని ప్రజలు తెలియజేస్తున్నారు.

## గ్రామసభలు నిర్వహించాలి : ఎంపిడిఒ

**ప్రజాశక్తి-ఆత్మకూరుఅర్బన్** : ఆత్మకూరు మండలంలోని అన్ని పంచాయతీల్లో ఉపాధి హామీపై గ్రామసభలు నిర్వహించాలని ఎంపిడిఒ సి.శ్రీనివాసులు తెలియజేశారు. బుధవారం తన కార్యాలయంలో ఉపాధి సిబ్బందితో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎన్ఆర్ఇజిఎస్ 2023-24 సంవత్సరానికి వెంటనే వర్క్స్ యాక్షన్ ప్లాన్ రూపొందించి వాటిని గ్రామసభ ద్వారా ఆమోదించి జేసుకోవాలని, దీని కోసం ఆయా సర్పంచ్, కార్యదర్శులతో ఫీల్డ్ అసిస్టెంట్లు సమన్వయం చేసుకోవాలని ఆయన కోరారు. వర్షాలు పడుతున్నందున వల్ల వేజెస్ కోసం పంటకాలువ పనులు త్వరితగతిన చేపట్టాలని ఆయన సూచించారు. సమావేశంలో ఎ.పి.ఒ. శిరీష, టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

## రోడ్డుకిరువైపుల కంపచెట్లు

**ప్రజాశక్తి-బిట్రగుంట** : బోగోలు మండలం విశ్వనాథరావుపేట పంచాయతీ కొత్తూరు గ్రామం నుంచి రైల్వే స్టేషన్‌కు వెళ్లే మార్గం గుండా దట్టమైన ముళ్ల చెట్లతో రోడ్డు మూసుకొని పోయి ఉంది. ఈ ప్రాంతంలో ఇటీవల మనుషులపై అడవి జంతువుల దాడులు కూడా జరిగిన సంఘటనలు చోటుచేసుకున్నాయి. పంచాయతీ అధికారులకు పలుమార్లు సమస్యను ప్రస్తుతం వివరించిన అధికారులు మాత్రం పట్టించుకోకపోవడంతో గ్రామస్తుల సహకారంతో గ్రామస్తులు, యువత ముందుకొచ్చి తమ సొంత నిధులతో రోడ్డుకు ఇరువైపులా ఉన్న ముళ్లపొదలు చెట్లను తొలగించారు. ఇకనైనా పంచాయతీ అధికారులు స్పందించి రోడ్డు కిరువైపుల ఉన్న చెట్లను తొలగించాలని ప్రజలు కోరుతున్నారు. కార్యక్రమంలో ఏనుగుల సంజీవరెడ్డి స్థానిక యువత తదితరులు ఉన్నారు.

## గండిపాలెం ప్రాజెక్టు పరిశీలన

**ప్రజాశక్తి-ఉదయగిరి** : ఇటీవల ఎడతెరపిలేని వర్షం కురుస్తున్న నేపథ్యంలో గండిపాలెం ప్రాజెక్టును ఉదయగిరి ఇరిగేషన్ డిఇ సాయి శంకర్ నారాయణ ఆకస్మికంగా తనిఖీ చేశారు. బుధవారం మండల పరిధిలోని గండిపాలెం ప్రాజెక్టును ఆయన పరిశీలించి ఈ సందర్భంగా ఆయన క్రస్ట్ గేట్లు పనితీరు, లీకేజీ పలు అంశాలను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం నాలుగు, ఐదు, ఆరు ఎడమ కాలువ డిస్ట్రిబ్యూటర్ చానెల్ నుండి వెళ్లే నీటిపారుదల ద్వారా ఆయకట్టు రైతులకు సరిగా నీరు అందుతుందా లేదా అని రైతులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఎఇ విక్రమ్, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

## 'ఉపాధి' పనులు కల్పించాలి

**ప్రజాశక్తి-ఉదయగిరి** : గ్రామంలో ఉపాధి కూలీలు శాతం పెంచి ఉపాధి పనులు కల్పించాలని ఎంపిడిఒ ఐజాక్ ప్రవీణ్ ఉపాధిహామీ సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. బుధవారం స్థానిక ఎంపిపి అతిథి భవనంలో మండల పరిధిలోని ఉపాధి హామీ పథకంలో పనిచేసే ఫీల్డ్ అసిస్టెంట్లు పలువురు సిబ్బందితో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చేసే మండలంలో త్వరితగతిన పని దినాలలో పూర్తిచేసి కూలీల సంఖ్య పెంచాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో కొట్టాలపల్లి సొసైటీ చైర్మన్ మూలి వినయ్ రెడ్డి, ఇసి శ్రీనివాసులు, పంచాయతీ కార్యదర్శి అమర్నాథ్ రెడ్డి, తదితరులున్నారు.

## పిల్లలకు నోట్ బుక్స్ పంపిణీ

**ప్రజాశక్తి-కొండాపురం** : మండలంలోని యల్లయపాలెం గ్రామంలో ఎంపిపి స్కూల్ పాఠశాలలో చదువుతున్న బాలబాలికలకు బుచ్చిరెడ్డిపాలెం సహారా ఎడ్యుకేషనల్ రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ వారి ఆధ్వర్యంలో నోట్‌బుక్స్, పలకలు పెన్సిల్స్, ప్లేట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా మండల విద్యాశాఖ అధికారి వసంత కుమారి, ఎపిఎం రుక్మిణి పాఠశాల ప్రధానోపాధ్యాయులు గౌస్ బాషా, ఉపాధ్యాయులు నారాయణరావు, సొసైటీ అధ్యక్షులు ఎజ్దానీబాషా, సెక్రటరీ పి. దయాకర్ పాల్గొన్నారు. ఎంఇఒ వసంతకుమారి మాట్లాడుతూ ఈ సంస్థ వారు ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న నిరుపేద పిల్లలకు ఎన్నో సేవా కార్యక్రమాలు చేస్తుందని, వారిని అభినందిస్తున్నామన్నారు. పిల్లలు రోజు బడికి రావాలి, బాగా చదువుకోవాలి, వారు అభివృద్ధి చెందాలి, మంచి ఉద్యోగస్తుల వారి సమాజంలో మంచి పేరు తేవాలన్నారు. తల్లిదండ్రులు పిల్లలను తప్పకుండా ప్రతిరోజూ బడికి పంపించాలని కోరారు. సొసైటీ అధ్యక్షులు ఎజ్దానీ బాషా మాట్లాడుతూ సంస్థ ఎన్నో సేవా కార్యక్రమాలు చేస్తున్న ప్రతి కార్యక్రమానికి దాతలు సహకారాలతోని ఈ కార్యక్రమాలు చేస్తున్నామన్నారు. అందరూ బాగా చదువుకో వాలని కోరారు.

# భయభ్రాంతులకు గురి చేసిన వారిని శిక్షించాలి

**ప్రజాశక్తి-ఉదయగిరి**



మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కె.అజయ్‌కుమార్

గిరిజనులకు భూదానం చేసేందుకు సహకరించిన దాతలపై వైసిపి నాయకులు దాడికి దిగడం సిపిఎం తరఫున జిల్లా సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కటారి అజయ్‌కుమార్ తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. బుధవారం స్థానిక పుచ్చలపల్లి సుందరయ్య భవనంలో స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడుతూ మండల పరిధిలోని కొత్తపల్లి సమీపంలోని రోడ్డు పక్కన నివాసం ఉంటున్న 40 కుటుంబాల గిరిజనులకు పక్కా గృహాలు నిర్మించుకునేందుకు అదే గ్రామానికి చెందిన కాశిరెడ్డి రెండు ఎకరాల భూమిని గిరిజనులకు ఇవ్వగా, సహించని స్థానిక సొసైటీ అధ్యక్షులు ఎంపిటిసి భర్త మూలి వినయ్‌రెడ్డి ఆయన అనుచరులతో కలిసి కాశిరెడ్డి సిపిఎం మండల నాయకులు కాకు వెంకటయ్యపై దాడి చేయడం హేయమైన చర్య అని తీవ్రంగా ఖండిస్తున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. గిరిజనులు భూమిని జెసిబిలతో చదును చేసే క్రమంలో వారు అక్కడికి చేరుకుని వారిని భయభ్రాంతులకు గురి చేయడంతో భూమిని గిరిజనులకు కాశిరెడ్డి ఎంపిటిసి భర్త కాకు వెంకటయ్యను పిలవాల అక్కడికి చేరుకున్న వారిపై వైసిపి నాయకులు దాడి చేశారని ఎంపిటిసిగా ఓటమిని జీర్ణించుకోలేక సిపిఎం అభ్యర్థిగా కాకు విజయమ్మ చేపడుతున్న గిరిజనులకు సొంత గృహాలు నిర్మాణంలో దాతలు సహకారంతో భూమిని శుభ్రం చేస్తున్న తరుణంలో గిరిజనుల భయభ్రాంతులకు గురిచేస్తూ వారికి సహకారులు అందిస్తున్న దాతలు సిపిఎం నాయకులపై దాడులు జరిపారన్నారు. జరిగిన విషయంపై సంబంధిత పోలీసులకు ఫిర్యాదు చేసిన ఇంత వరకు వారిపై చర్య తీసుకోక పోవడం పోలీసుల నిర్లక్ష్యానికి నిదర్శనంగా ఉందన్నారు. గిరిజనుల భయ భ్రాంతులు చేసి దాడులు నిర్వహించిన వారిపై వెంటనే చర్యలు తీసుకొని పూర్తిస్థాయిలో విచారణ చేపట్టి వారిపై కఠిన చర్యలు తీసుకొని శిక్షించాలని ఆయన కోరారు. ఉదయగిరి మెట్ట ప్రాంతంలో ఇంతవరకు జరగని పరిణామాలు ఆనవాయితీలను పల్లె ప్రజలకు ఈ ప్రభుత్వ నాయకులు అలవాటు చేయడంపై పలువురు సిపిఎం జిల్లా నాయకులు మండిపడ్డారు. ఫిర్యాదు చేసిన వారిని విచారణ చేయకుండా కేసు పెట్టిన వారిని పిలవడం విడ్డూరంగా ఉందన్నారు. గిరిజనులకు సహాయం చేసేవారు వారిని భయభ్రాంతులకు గురిచేసే కక్ష సాధింపు చర్యలు చేపడుతున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని సామాన్య ప్రజలలో పోలీసులపై ఉన్న నమ్మకాన్ని నిలబెట్టుకోవాలని వారు కోరారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు మూలి వెంగయ్య, జిల్లా కమిటీ సభ్యులు మంగల పుల్లయ్య, గంటా లక్ష్మీపతి, ఎంపిటిసి కాకు విజయ, సిపిఎం మండల కార్యదర్శులు కోడె రమణయ్య, మల్లికార్జున, సింహాద్రి, నాగూర్ సాహెబ్, పర్ధిన్ బాషా, మర్రిపాడు, కలిగిరి మండల నాయకులు పాల్గొన్నారు.

## జిల్లా వక్ఫ్‌బోర్డు డైరెక్టర్‌గా యస్థాని

**ప్రజాశక్తి-ఉదయగిరి**



ఉదయగిరి పట్టణానికి చెందిన ముస్లిం మైనార్టీ నాయకుడు గడియాల్చి ఎస్థాని వక్ఫ్‌బోర్డు జిల్లా కమిటీ డైరెక్టర్‌గా విజయవాడలో రాష్ట్ర వక్ఫ్‌బోర్డు చైర్మన్ ఖాదర్ బాషా నియామక పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా వక్ఫ్‌బోర్డు డైరెక్టర్‌గా నియమించడానికి కృషిచేసిన ఎంఎల్ఎ మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డికి, ప్రచార కార్యదర్శి ఎస్.శాంతికుమారికి ధన్యవాదాలు తెలిపారు. పార్టీ కోసం 12 సంవత్సరాల నుండి కృషిచేసిన వారిని గుర్తించి జిల్లా పదవి ఇవ్వడం ముస్లిం మైనార్టీ వర్గాలపై ఎంఎల్ఎ చంద్రశేఖర్‌రెడ్డి చూపుతున్న ప్రేమకు ఇది నిదర్శనమన్నారు. జగన్మోహన్ రెడ్డి ముఖ్యమంత్రి అయిన తర్వాత ముస్లిం మైనార్టీలకు ఉప ముఖ్యమంత్రి నుండి డైరెక్టర్ వరకు రాష్ట్రవ్యాప్తంగా పదవులు ఇచ్చి వారి ఉన్నతికి ఎనలేని కృషి చేస్తున్నారని ఎస్థాని పేర్కొన్నారు. అనంతరం మెట్ట ప్రాంత వాసి గడియాల్చి ఎస్థాని వక్ఫ్‌బోర్డు నియామకంపై ఉదయగిరి పంచాయతీ పాలకవర్గం, సర్పంచ్, ఉపసర్పంచ్ ముర్తుజా హుస్సేన్, పంచాయతీ సభ్యులు, ఎంపిటిసి పెదమస్తాని, మతపెద్దలు హర్షం వ్యక్తం చేశారు.

## ముగిసిన గ్రంథాలయ వారోత్సవాలు

**ప్రజాశక్తి-మర్రిపాడు**




స్థానిక గ్రంథాలయంలో 55వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు బుధవారం ఘనంగా ముగిశాయి. వారోత్సవాలలో విద్యార్థులకు పలు అంశాలపై నిర్వహిం చిన పోటీ పరీక్షలలో విజేతలకు సర్పంచ్ బీబీజాన్, వైసిపి మాజీ కన్వీనర్ శ్రీనివాసులు నాయుడు బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రంథాలయ ప్రాముఖ్యత గూర్చి వివరించి విద్యార్థులు గ్రంథాలాయాన్ని వినియోగించుకోవాలని సూచించారు. ఉత్తమ ఉపాధ్యాయురాలుగా అవార్డు పొందిన మాలినిని, ఇంకాపలువురిని శాలువాలతో ఘనంగా సన్మానించారు. వారోత్సవాలలో తనకు పరోక్షంగా సహకరించిన పాఠకులు, అధికారులకు గ్రంథాలయ భాండాగారి నారాయణరావు ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలియజేశారు. కార్యక్రమంలో ప్రభుత్వ జూనియర్ కాలేజ్ ప్రిన్సిపాల్ హనుమంతరావు, బాలుపల్లి మెయిన్ ప్రధానోపాధ్యాయులు సుబ్బారాయుడు, రాజుపాలెం బిడిసిఎల్ నిర్వాహకులు శ్రీనివాసులు పాల్గొన్నారు.



ఎగ్జిబిషన్‌ను సందర్శిస్తున్న ఇఒపిఆర్‌డి భార్గవి

## సైన్స్ ఎగ్జిబిషన్

**ప్రజాశక్తి-సీతారామపురం**

స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పి.సుధాకర్ ఆధ్వర్యంలో బుధవారం సైన్స్ ఎగ్జిబిషన్ నిర్వహించారు. విద్యార్థులు తయారుచేసిన సైన్స్ నమూనా పరికరాలను ఇఒపిఆర్‌డి ఎన్.భార్గవి సందర్శించారు. ఈ ప్రదర్శన నుండి 5 నమూనాలను మండలస్థాయికి ఎన్నిక చేసినట్లు ప్రధానోపాధ్యాయుడు తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల సైన్స్ ఉపాధ్యాయులు విజయబాబు, విద్యార్థనరెడ్డి, లావణ్య, సుభాన్ బాషా, అన్సర్ బాషా, జయరామిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# కార్మికుల సమస్యలను పరిష్కరించాలి

**ప్రజాశక్తి-కావలి**



డిఎఒ సూర్యనారాయణసింగ్‌కు వినతినిస్తున్న కార్మికులు

కావలి పట్టణంలో పనులు చేస్తున్న పారిశుధ్య కార్మికుల సమస్యలను పరిష్కరించాలని బుధవారం సిఐటియు ఆధ్వర్యంలో మున్సిపల్ కార్మికులు ఆర్‌డిఒ కార్యాలయంలో ఎఒ సూర్యనారాయణ సింగ్‌కు వినతి పత్రం అందజేశారు. అనంతరం సిఐటియు పట్టణ కార్యదర్శి యర్రంశెట్టి క్రిష్ణమోహన్ మాట్లాడుతూ వారి కుటుంబ ఇబ్బందుల వల్ల, అనారోగ్య కారణాలు వచ్చినప్పుడు గతంలో అధికారులు వారి కుటుంబ సభ్యులతో పనులు చేయించుకునే వారని, దీంతో కార్మికులకు కొంత వెసులుబాటు ఉండేదన్నారు. కమిషనర్ శివారెడ్డి వచ్చిన దగ్గర నుండి అలాంటిది చేయకుండా కార్మికులు ఇబ్బందులు పడుతున్నప్పటికీ వారి స్థానంలో వేరే వారిని పనులు చేయకుండా ఇబ్బందులు పెడుతున్నారన్నారు. దీనివల్ల కార్మికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని అంతేకాకుండా కార్మికులకు మస్టర్ గతంలో ఐదున్నర గంటల వరకు కొనసాగించేవారన్నారు. ఈ కమిషనర్ వచ్చిన తర్వాత ఐదు పదిహేను నిమిషాలకు మస్టర్, మూసివేయిస్తున్నాడని ఆరోపించారు. దీనివల్ల కొంత మంది కార్మికులు తిరిగి ఇళ్లకు వెళ్లిపోతున్నారని ఇది చాలా దుర్మార్గమైన విషయమన్నారు. ముఖ్యంగా కార్మికులకు పనిముట్లు, యూనిఫారం, గ్లౌజులు చెప్పులు, కొబ్బరి నూనెలు, సబ్బులు ఇవ్వాల్సిన ఉన్నప్పటికీ ఈ కమిషనర్ ఈ సమస్యను పరిష్కరించాలని అనేకసార్లు కమిషనర్ దృష్టికి తీసుకుపోయినప్పటికీ ఫలితం లేదన్నారు. అందువల్ల ఈ సమస్యలను పరిష్కరించాలని ఆర్‌డిఒ దృష్టికి తీసుకొస్తున్నామన్నారు. ఇప్పటికైనా ఆర్‌డిఒ స్పందించి కార్మికుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్మికుల సమస్యలు పరిష్కారం కాకపోతే త్వరలోనే ఆందోళన చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు పి.పెంచలనరసింహం, యూనియన్ నాయకులు తురక శీనయ్య, బిరదల మహేష్, ఒంగోలు రమేష్, శివకోటయ్య, క్రాంతి, అఖిలేష్, తదితరులు పాల్గొన్నారు.



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న కమిషనర్ రమేష్‌బాబు

## క్రీడలతో శారీరక, మానసిక ఉల్లాసం

**ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్**

విద్యార్థులు క్రమశిక్షణతో కూడిన విద్యను పొందడంతో పాటు ఉత్సాహంగా క్రీడల్లో పాల్గొంటే శారీరిక అభివృద్ధితోపాటు మానసిక ఉల్లాసం కలుగుతుందని మున్సిపల్ కమిషనర్ ఎం.రమేష్ బాబు తెలిపారు. బుధవారం ఆత్మకూరు పురపాలక పరిధిలోని విక్రమ సింహపురి విశ్వవిద్యాలయం కబడ్డీ, స్థానిక ఎస్.ఆర్.జె డిగ్రీ కళాశాలలో అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. ఈ పోటీల ప్రారంభ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఆత్మకూరు మున్సిపల్ కమిషనర్ ఎం.రమేష్ బాబు పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆటల వల్ల శారీరిక దారుఢ్యం మానసిక వికాసం కలుకుతాయని తెలిపారు. కళాశాల కరస్పాండెంట్ రాధాకృష్ణయ్య మాట్లాడుతూ కళాశాలలో ఎల్లప్పుడూ క్రీడలకు అత్యంత ప్రోత్సాహం ఉందన్నారు. కార్యక్రమంలో విఎస్‌యు స్పోర్ట్స్‌బోర్డు సెక్రటరీ డాక్టర్ కనుమూరి సునీత, ప్రిన్సిపల్ జి వర కుమారి, పిడి సిరిమామళ్ల వెంకటేశ్వర్లు, యూనివర్సిటీ అబ్జర్వర్ ఎం.రవీంద్రబాబు కావలి జవహర్ భారతి పిడి ప్రసాద్‌రెడ్డి, నారాయణరాజు, కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు. కబడ్డీ పోటీలలో జేబీ కళాశాల కావలి, శ్రీ సాయి కళాశాల కావలి, డాక్టర్ ఎస్ ఆర్ జె డిగ్రీ కళాశాల ఆత్మకూరు, ఎంఎస్ఆర్ కళాశాల కావలి, చంద్రారెడ్డి కళాశాల నెల్లూరు, గవర్నమెంట్ డిగ్రీ కళాశాల కోవూరు, టీములు క్వార్టర్ ఫైనల్‌కి చేరుకున్నాయి. ఈ సందర్భంగా ఆర్గనైజింగ్ సెక్రటరీ సిరిమావిళ్ల వెంకటేశ్వర్లు తెలియజేశారు.

# సాంస్కృతిక మేళాను జయప్రదం చేయాలి

**ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్**




మాట్లాడుతున్న సిఐటియు నాయకులు

సెంటర్ ఆఫ్ ఇండియన్ ట్రేడ్ యూనియన్ (సిఐటియు) 11వ జిల్లా మహాసభలు సందర్భంగా నిర్వహించే సాంస్కృతిక మేళాను జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా నాయకులు జి శివప్రసాద్, మండల కార్యదర్శి కొండమూరి హజరత్తయ్యలు పేర్కొన్నారు. బుధవారం పట్టణంలోని డాక్టర్ చెల్లో రమణారెడ్డి భవన్‌లో సిఐటియు ఆహ్వాన సంఘం జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ సంధానిబాషా, కళాకారులు గద్దర్ బాబు, షుకూర్ మాట్లాడుతూ సిఐటియు జిల్లా మహాసభలు 11, 12 తేదీలలో ఆత్మకూరు పట్టణంలో జరుగుతున్న నేపథ్యంలో అమరగాయకులు ఘంటసాల శత జయంతి ఉత్సవాల్లో భాగంగా పాఠశాల, కళాశాల, విద్యార్థినీ విద్యార్థులకు ప్రతిభ పోటీలు, సాంస్కృతిక మేళా కార్యక్రమాలు నిర్వహించారు. ప్రతిభా పాటవాల నిరూపణకు సిఐటియు, జన విజ్ఞాన వేదిక, ప్రజానాట్యమండలిలి ఆధ్వర్యంలో జరుగుతున్న మండల స్థాయి పోటీలలో పాల్గొని ప్రతిభ కనపరుచు ప్రతి ఒక్కరికి కళాభినందన తెలియజేస్తూ వ్యాసరచన పోటీ పాఠశాల, కళాశాల స్థాయిలో నవంబర్ 25న అంశం భారతదేశం – లౌకిక తత్వం, చిత్రలేఖనం భారతదేశం – మతసామరస్యం, ఆయా పాఠశాలలలో నవంబర్ 25న చేపట్టి అందులో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు పొందిన విద్యార్థులకు డిసెంబర్ 5, 6 తేదీలలో మండల స్థాయి ప్రతిభ పోటీని నిర్వహిస్తామన్నారు. డిసెంబర్ 9, 10, 11 ప్రజానాట్యమండలి, జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో సాంస్కృతిక మేళా నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమం నేతాజీ క్లబ్ (పాత మున్సిపల్ కార్యాలయం) జరిగే సాంస్కృతిక మేళాలో బహుమతులు అందజేస్తారన్నారు. సాంస్కృతిక మేళాలో పాల్గొనే హైస్కూలు విద్యార్థులు కళారూపం ప్రదర్శనకు డిసెంబర్ 4 తేదీ లోపల తమ పేర్లను నమోదు చేసుకోవాలని కోరారు. మూడు రోజులు జరిగే సాంస్కృతిక మేళాను జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు, కళాకారులు నూతలపాటి పెంచలయ్య పాల్గొన్నారు.



## ఘనంగా లక్ష దీపోత్సవం

**ప్రజాశక్తి-ఇందుకూరుపేట**

మండలంలోని మైపాడులో వెలసి ఉన్న శ్రీ అన్నపూర్ణ అంబాదేవి సమేత ప్రసన్న విశ్వేశ్వర స్వామి ఆలయంలో కార్తీక మాసం సందర్భంగా లక్ష దీపోత్సవ కార్యక్రమాన్ని ఆలయ చైర్మన్ కనుపూరు సురేంద్ర ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి యువ నాయకులు దువ్వూరు కళ్యాణ్‌రెడ్డి, వారి కుటుంబ సభ్యులు విచ్చేశారు. ఈ సందర్భంగా అర్చకులు వేద మంత్రాలతో స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామి అమ్మవార్లకు పట్టు వస్త్రాలు సమర్పించారు. కార్యక్రమంలో మైపాడు సర్పంచ్ సంగం వెంకయ్య, మాజీ ఎంపిటిసి శ్రీహరికోట ప్రసాద్, చుట్టుపక్కల గ్రామాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు విచ్చేశారు.



## నియోజకవర్గ స్థాయి క్రీడల పోటీలు


**ప్రజాశక్తి-విడవలూరు**

ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి జన్మదినం సందర్భంగా రాష్ట్రంలో క్రీడలు ప్రోత్సహించాలనే ఉద్దేశంతో జగనన్న క్రీడా సంబరాలు–2022 రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ శ్యాప్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేస్తున్నట్లు జిల్లా వ్యవసాయ సలహా మండలి అధ్యక్షులు దొడ్డంరెడ్డి నిరంజన్‌బాబురెడ్డి తెలిపారు. కోవూరు నియోజకవర్గంలోని కోవూరు, కొడవలూరు, విడవలూరు, బుచ్చిరెడ్డిపాలెం, ఇందుకూరుపేట మండలాలలో 17 సంవత్సరాలు నిండిన యువతీ యువకులకు కబడ్డీ, వాలీబాల్, క్రికెట్, షటిల్ బ్యాడ్మింటన్ విభాగాలలో ఎంపికలు కోవూరు జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాలలో 25వ తేదీ ఉదయం 9 గంటలకు జరుగుతాయని తెలియజేశారు. పోటీలలో పాల్గొన్న క్రీడాకారులకు ఉచిత భోజన వసతి కల్పిస్తున్నట్లు, జిల్లాస్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారులకు ఉచితంగా క్రీడా దుస్తులు అందజేశారు. పై పోటీలలో రాష్ట్ర స్థాయిలో గెలుపొందిన జట్లకు రూ.50,00,000 నగదు ప్రోత్సాహకాలు అందజేస్తున్నట్లు, ఆసక్తి గల క్రీడాకారులు తమ ఆధార్ కార్డును తీసుకుని రమణయ్య ఫిజికల్ డైరెక్టర్ పాటూరు 9490320435, వైసిపి కార్యాలయం కోవూరు వారిని సంప్రదించాలని కోరారు.

## ప్రత్యేక పూజలు

**ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్**

బుధవారం ఆత్మకూరు మున్సిపల్ పరిధిలోని హను మాన్ జంక్షన్‌లో వెలసియున్న అభయాంజనేయ స్వామికి బుధవారం డిఎస్‌పి కోటారెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయానికి విచ్చేసిన డిఎస్‌పికి ఆలయ ధర్మకర్త ఏటూరు సుధాకర్‌రెడ్డి, ప్రధాన అర్చకులు కృష్ణమూర్తి, ఆలయ సాంప్రదాయ బద్ధంగా ప్రత్యేకంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహింపజేసి తీర్థప్రసాదాలు అందజేశారు.



## దేవరకొండ విజయ్‌కు పరామర్శ



**ప్రజాశక్తి-కావలి** : హ్యాపీ సేవాసంస్థ ఉపాధ్యక్షులు విజయ్ దేవరకొండకు కిడ్నీలో రాళ్లు ఏర్పడి అనారోగ్యంతో బాధపడుతూ నెల్లూరు విజయ హాస్పిటల్‌లో ఆపరేషన్ చేయించుకొని వారి ఇంటికి చేరుకున్న సంగతి తెలుసుకున్న సంస్థ సభ్యులందరూ బుధవారం వెళ్లి పరామర్శించారు. ఆయన యోగ క్షేమాలు తెలుసుకొని ఆరోగ్యం విషయంలో తగు జాగ్రత్తలు, సూచనలు, ఇచ్చి కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా హ్యాపీ సేవాసంస్థ గౌరవ అధ్యక్షులు షేక్.ఖాదర్‌బాషా, అధ్యక్షులు ఘనిబాషాలు మాట్లాడుతూ హ్యాపీ సేవాసంస్థకు దేవరకొండ. విజయ్ వెన్నెముక లాంటి వారని అతనికి అనారోగ్యం అని తెలిసి చాలా బాధపడ్డామని, ఆపరేషన్ ద్వారా కోలుకోవడం చాలా సంతోషంగా ఉందని, త్వరగా కోలుకొవాలని మరల ఆరోగ్యంతో జనజీవన స్రవంతిలో ఉల్లాసంగా పాల్గొనా లని భగవంతుణ్ణి ప్రార్థిస్తున్నా మన్నారు. హ్యాపీ సేవాసంస్థ అధ్యక్షులు సయ్యద్.ఘనీబాషా, సలహాదారులు చేవూరు.ప్రభయ్య, సహాయ కార్యదర్శి మారుబోయిన. నాగరాజు, సభ్యులు ఆంచింపాక.హాజరత్తయ్య, బి.క్రాంతి, షేక్.కరీముల్లా, జాగర్లపూడి. సాయిశివ, తదితరులు పరామర్శించారు.

## పేద మహిళలకు జీవనోపాధి కల్పన

**ప్రజాశక్తి-కావలి**




సంయుక్త సేవా సంస్థ ఉచిత కుట్టు శిక్షణా కేంద్రంలో మార్టూరి. మాల కొండయ్య – సరోజన మ్మ దంపతుల జ్ఞాప కార్థంగా నెల్లూరు దిశ పోలీసు స్టేషన్‌లో ఎఎస్ఐగా విధులు నిర్వహిస్తున్న మార్టూరి.పరమేశ్వరి తుఫాన్ నగర్‌కు చెందిన మాధవి అనే పేద మహిళకు కుట్టు మిషను ఇచ్చి స్వయం జీవనోపాధిని కల్పించారు. కార్యక్రమంలో కావలి రూరల్ పోలీసులు కానిస్టేబుల్ జె.అయోధ్య కుమార్, జాగో స్వచ్ఛంద సేవాసంస్థ అధ్యక్షుడు షేక్ జహీర్, సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు సురేంద్ర, కుట్టు శిక్షణ నేర్చుకుంటున్న మహిళలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సంస్థ అధ్యక్షుడు సురేంద్ర మాట్లాడుతూ ఈనాటి దాత ఎఎస్ఐ ఎం.పరమేశ్వరి తన తల్లిదండ్రులు పేరుమీద పేద మహిళకు కుట్టు మిషను ఇచ్చి స్వయం జీవనోపాధిని కల్పించడం సంతోషంగా ఉందని తెలిపారు. ఈ సందర్భంగా వారికి ధన్యవాదాలు తెలిపారు. మిషన్ తీసుకున్న పేద మహిళ మాధవి మాట్లాడుతూ సంయుక్త సేవాసంస్థ ద్వారా ఉచితంగా కుట్టు శిక్షణ ఇవ్వడమే కాకుండా మాలాంటి పేద వారికీ జీవనోపాధిని కల్పించడం సంతోషంగా ఉందని తెలిపారు. సహాయం అందజేసిన దాత పరమేశ్వరికి కృతజ్ఞతలు తెలియజేశారు.

## దుప్పట్లు పంపిణీ

**ప్రజాశక్తి-కావలి** : కావలిలో సర్వబట్ల వారివీధిలో "శ్రీ సత్యసాయి సేవా సమితి" కావలి వారి అధ్వర్యంలో బుధవారం ఉదయం పంచామృత అభిషేకాలు, పలు రకాల పూలతో అలంకరణ, ఉయ్యాల ఉత్సవం, విష్ణు, లలిత సహస్రనామ పారాయణం, నిరుపేదలకు 97మందికి దుప్పట్లు పంపిణీ చేశారు. అనంతరం ఏరియా హాస్పిటల్‌లో 250మందికి అన్నదానం, బాబా మందిరం లో 300 మందికి అన్నదానం చేసిన ట్లు సత్యసాయి బాబా మందిరం కమిటీ ప్రధాన కార్యదర్శి కర్నాటి వెంకటసుబ్బారావు తెలిపారు. కొత్తూరు సత్య నారాయణ కన్వీనర్, ట్రెజరర్ కర్నాటి శివ, పేర్ల సుబ్బారావు, ఇలింద్రవినోభ,ఎం.గోపాల్, తదితరులున్నారు.

## 27న ఉచిత వైద్య శిబిరం

**ప్రజాశక్తి-కావలి** : భారత రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా బోగోలు మండలం విశ్వనాథరావుపేట గ్రామపంచాయతీ రామ స్వామి పాలెంలో శ్రీ విఘ్నేశ్వర శ్రీ రామలింగేశ్వర దేవస్థానంలో 27వ తేదీ ఆదివారం డాక్టర్ బిందుమీనన్ ఫౌండేషన్ వారి ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు అంబేద్కర్ సేవాదళ్ సభ్యులు బత్తుల రవిచంద్ర ప్రకటనలో తెలిపారు. ముందుగా వచ్చి 27వ తేదీ ఉదయం 9:45 లోపు మీ పేరు నమోదు చేసుకోవాలని తెలిపారు. వచ్చేటప్పుడు పాత రిపోర్టులు, వాడే మందులు చీటీ తీసుకొని రావాలన్నారు.

# పలుచోట్ల గడపగడపకు మన ప్రభుత్వం





అల్లూరు, ఉదయగిరిలో గడపగడప కార్యక్రమంలో మాట్లాడుతున్న కావలి ఎంఎల్ఎ రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి, ఉదయగిరి ఎంఎల్ఎ మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి

**ప్రజాశక్తి-అల్లూరు**

మండల కేంద్రంలోని తూర్పు మహమ్మదీయపాలెం, బలిజపాలెం తదితర కాలనీలలో బుధవారం కావలి ఎంఎల్ఎ రామిరెడ్డి ప్రతాప్‌కుమార్ రెడ్డి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని విస్తృతంగా చేపట్టారు. జోరు వర్షాన్ని సైతం లెక్కచేయకుండా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగన్మోహన్ రెడ్డి ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలు అందాయా లేదోనని ఆరాదీశారు. ఒకవేళ అందకపోతే వాలంటీర్, సచివాలయ వ్యవస్థ ద్వారా వారికి ఆ పథకాలను అందిస్తామన్నారు. ఆసరా, జగనన్న చేయూత, అమ్మఒడి పథకాలు ప్రవేశ పెడుతూ వృద్ధులకు, వికలాంగులకు, వితంతువులకు అలాగే ఒంటరి మహిళలకు 1వ తేదీ వచ్చిన వెంటనే పింఛన్లు అందజేస్తున్నారని వివరించారు. చంద్రబాబునాయుడు, పవన్‌కళ్యాణ్ బూతులు తిడుతూ ఇష్టమొచ్చినట్లు మాట్లాడుతున్నారని ఎద్దేవా చేశారు. కావలి నియోజకవర్గంలో 56 రోజుల నుండి గడపగడప కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ మండలంలో విద్యుత్ స్తంభాలు, వైర్లు అలాగే తాగునీటి సమస్య తీవ్రంగా ఉందని ప్రజలు తన దృష్టికి తీసుకువచ్చారన్నారు. త్వరలో జలజీవన్ మిషన్ ద్వారా ప్రతి పంచాయతీకి తాగునీరు అందించే బాధ్యత తనదేనని ప్రజలకు హామీనిచ్చారు. నార్త్ మోపూరు వద్ద ఇప్పటికే బోర్లు వేయించామని రూ.1.4 కోట్ల విలువతో పైప్ లైన్లు వేసి 8 నెలల్లో తాగునీటి సమస్య తీరుస్తానన్నారు. వాలంటీర్ వ్యవస్థ ద్వారా ఎంతో ఉపయోగకరమని ఇంటి వద్దకే పింఛన్లు రేషన్ బియ్యం అందిస్తున్నారని వ్యాఖ్యానించారు. కార్యక్రమంలో వైసిపి మండల ప్రధాన కార్యదర్శి సామంతుల సురేష్‌రెడ్డి, కోడూరు సాధక్ కుమార్‌రెడ్డి, మండల ఉపాధ్యక్షులు గుమ్మడి సురేంద్ర, ఉస్మాన్ షరీఫ్, కరేటి దైవదానం, మేడా కృష్ణారెడ్డి, దాసరి పోలయ్య, నగర పంచాయతీ కమిషనర్ ఫణికుమార్, ఎంఇఒ నాగేశ్వరరావు, ఆర్ఐ సుధీర్ తదితరులున్నారు.

**ప్రజాశక్తి-ఉదయగిరి** : గడపగడపలో జగనన్న నవరత్నాలు సంక్షేమ పథకాలతో కుటుంబం ఆనందంగా ఉందని, మరొకసారి ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి అని ప్రజలు కోరుతున్నారని ఎంఎల్ఎ మేకపాటి చంద్రశేఖర్ రెడ్డి పేర్కొన్నారు. బుధవారం మండల పరిధిలోని పుల్లాయపల్లి పంచాయతీ పరిధిలోని లింగంనేనిపల్లి, ఎస్‌సి కాలనీ, పుల్లాయపల్లి గ్రామాలలో సర్పంచ్ కల్లూరి శ్యామలాదేవి కృష్ణారెడ్డి, ఆధ్వర్యంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎంఎల్ఎ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎస్‌సి కాలంలో పర్యటించిన ఆయనకు స్థానికుల అభ్యర్థన మేరకు చర్చి ప్రహరీ గోడ నిర్మాణానికి రూ.5 లక్షల నిధులు మంజూరు చేస్తానని హామీనిచ్చారు. అలాగే పుల్లాయపల్లి గ్రామంలో సైడుకాలువల నిర్మాణానికి నిధులు మంజూరు చేస్తానని హామీనిచ్చారు. దీంతో ఆయా గ్రామాల ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. అనంతరం ఆయా గ్రామాలలో జోరు వర్షం కురుస్తున్న లెక్కచేయకుండా గడపగడపకు తిరుగుతూ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి అందిస్తున్న సంక్షేమ ఫలాలు అందరికి అందుతున్నాయా లేదా అని అడిగి తెలుసుకున్నారు. రాబోయే ఎన్నికల్లో ముఖ్యమంత్రిగా జగన్మోహన్‌రెడ్డిని, శాసనసభ్యునిగా తనను గెలిపిస్తే నియోజకవర్గం మరింత అభివృద్ధి జరుగుతుందన్నారు. భారతదేశంలో మరే ముఖ్యమంత్రి చేయని విధంగా జగన్మోహన్‌రెడ్డి రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తున్నారన్నారు. ముఖ్యమంత్రి తీసుకున్న వికేంద్రీకరణకు మద్దతుగా ప్రజలంతా అండగా నిలవాలని, మూడు రాజధానులతో రాష్ట్ర మరింతగా అభివృద్ధి చెందుతుందన్నారు. కార్యక్రమంలో ఎంపిడిఒ ఐజాక్ ప్రవీణ్, తహశీల్దార్ సానా శ్రీనివాసులురెడ్డి, వైసిపి కన్వీనర్ అక్కి భాస్కర్ రెడ్డి, సొసైటీ అధ్యక్షులు మూలి వినయ్ రెడ్డి, మండల సర్పంచ్ కల్లూరు వెంకటేశ్వర్ రెడ్డి, మాజీ సర్పంచ్ మూలి సుబ్బారెడ్డి, ఆక్కుల రెడ్డి, కల్లూరి రమణారెడ్డి, వైసిపి నాయకులు కంబాల నారాయణరెడ్డి, పంచాయతీ కార్యదర్శి షేక్. కరిముల్లా, మండలంలోని అన్ని శాఖల అధికారులు, సచివాలయ ఉద్యోగులు, వాలంటీర్లు పాల్గొన్నారు.